బాధితులకు భరోసా కల్పించాలి

ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 14 : సహాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరినీ మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వారికి తాము ఉన్నాం అనే భరోసా కలిగించాలని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో నూతనంగా నియామకమైన పోలీస్ సిబ్బంది మొదటి బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వివిధ రకాల అభ్యర్థనలు, ఫిర్యాదులు, సమాచారం, సహాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరినీ మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వారికి మేము ఉన్నాం అనే భరోసా కలిగించాలని అన్నారు. ప్రతి పౌరుడికి సమన్యాయం జరిగేటట్లు చూడాలన్నారు. ప్రజలకు సత్వర న్యాయం జరగడానికి సాంకేతిక వనరులను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

అదనపు కలెక్టర్ నగేశ్

టీచర్లను వివరాలడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ నగేశ్

రామాయంపేట, ఫిబ్రవరి 14 : మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని లేకుంటే చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్ పేర్కొన్నారు. శుక్రవారం రామాయంపేట తెలంగాణ గురుకుల పాఠశాలను సందర్శించిన అధికారి పాఠశాలలోని కూరగాయలు, విద్యార్థులకు వండిన ఆహారంతో బాటు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో పనిచేస్తున్న సిబ్బంది ఎవరు కూడా సెలవులు పెట్టకుండా సక్రమంగా విద్యా బోధన చేపట్టాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులను తీసుకోలన్నారు. వారికి అందించే అల్పాహారంలో ఎలాంటి తేడాలు ఉండ వద్దన్నారు. ఇది పరీక్షల కాలమని కచ్చితంగా ప్రతిరోజు ప్రతి తరగతి గదిలోనే విద్యార్థులకు తరగతులు తీసుకోవాలన్నారు. టీచర్లతోనే విద్యార్థులకు చదువు వస్తుందని క్రమశిక్షణతో విద్యార్థులకు సమగ్ర బోధన చేపట్టాలన్నారు.మెనూ ప్రకారంభోజనం పెట్టడంతో బాటు ప్రతి క్లాస్ టీచర్ విద్యార్థులు భోజనం తినే ముందు అక్కడే ఉండి విద్యార్థుల బాగోగులు చూసుకోవాలన్నారు. పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించేలా టీచర్లు చర్యలు చేపట్టాలన్నారు. తరగతి గదులతో బాటు విద్యార్థులు నిద్రించే భవనాలను ఎప్పటికప్పుడు ప్రిన్సిపల్, టీచర్లు సదర్శించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ రజినీకుమారి, గురుకుల ప్రిన్సిపల్, టీచర్లు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

శివ్వంపేటలో ఎమ్మెల్సీ పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో మహిపాల్‌రెడ్డి

శివ్వంపేట, ఫిబ్రవరి 14 : ఈ నెల 27న జరిగే గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా శివ్వంపేట పోలింగ్‌స్టేషన్‌ను శుక్రవారం నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మహిపాల్‌రెడ్డి తహసీల్దార్ కమలాద్రికి పలు సూచనలు చేశారు. పోలింగ్‌స్టేషన్‌ను ఓటింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కమలాద్రికి సూచించారు. ఎన్నికల సిబ్బంది అలసత్వం వహించకూడదన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు ఆర్ఐ కిషన్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, ఫిబ్రవరి14 : నర్సాపూర్ డివిజన్ కేంద్రంలోని ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో మహిపాల్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఆదేశించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్ వైరు చోరీ

దొంగలు ధ్వంసం చేసిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్

వెల్దుర్తి, ఫిబ్రవరి 14 : వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి దుండగులు కాపర్‌వైర్, సామగ్రిని చోరీ చేసిన ఘటన మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ హల్దీవాగు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. రైతులు అనసూయ, శ్రీనివాస్, మ ల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ధ్వంసం చేసి ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైరుతో పాటు ఆయిల్‌ను చోరీ చేసి, ట్రాన్స్‌ఫార్మర్ విడిభాగాలను పక్కన పొలాల్లో పడేశారన్నారు. ఉద యం వచ్చి చూడగా పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వస్తువులు పడి ఉండడంతో పోలీసులతో పాటు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. విషయం తెలుసుకున్న ఏఈ పెంట్యానాయక్, ఏఎస్సై సాద త్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. శుక్రవా రం ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఈ పెంట్యానాయక్ తెలిపారు.

ఆయిల్ పామ్ మొక్కల ప్లాంటేషన్

మొక్కలను నాటుతున్న వ్యవసాయాధికారులు

నర్సాపూర్, ఫిబ్రవరి14 : నర్సాపూర్ మండల పరిధిలోని తుజాల్‌పూర్, శివంపేట్ మండల పరిధిలోని గంగాయిపల్లి గ్రామాల్లోని వ్యవసాయ పొలాల్లో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌ను వ్యవసాయ, హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సంధ్యారాణి, ఏవోలు దీపిక, లావణ్య, ఏఈవోలు రవి, పద్మ, అధికారులు అజయ్, రైతులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఒకరి మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు

వెల్దుర్తి, ఫిబ్రవరి 14 : ముగ్గురు యువకులు బైక్‌పై వేగంగా వెళ్లడంతో అదుపుతప్పిన బైక్ డివైడర్‌ను ఢీకొట్టడంతో నడుపుతున్న యువకుడు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలైన ఘటన మండల కేంద్రమైన మాసాయిపేట శివారు బంగారమ్మ ఆలయం సమీపంలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. చేగుం ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామానికి చెందిన రవి(28), శివకుమార్ (28), రాయపోల్ మండలం బేగంపేట గ్రామానికి చెందిన భాను (25) ముగ్గురు బైక్‌పై చేగుంట నుంచి తూప్రాన్ వైపు వెళ్తున్నారు. బంగారమ్మ ఆలయం సమీపంలో అదుపుతప్పిన బైక్ డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న రవి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శివకుమార్, భానుకు తీవ్రగాయాలయ్యాయి. మృతిచెందిన రవి మృతదేహాన్ని తూప్రాన్ దవాఖానకు, శివకుమార్, భానులను చికిత్స కోసం గాంధీకి తరలించారు. ప్రమాద విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలి

కలెక్టర్ రాహుల్ రాజ్

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 14 : విద్యార్థులు మంచి మార్కులతో ఉతీర్ణులు కావాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శుక్రవారం హవేళీఘనపూర్ మండలంలోని బూరుపల్లిలోని జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులతో పాటు వంటగదిని పరిశీలించి విద్యార్థులు ముచ్చటించి గణితం, సైన్స్, ఇంగ్లిషు పాఠాలు బోధించి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల చతుర్విధ ప్రక్రియలో నిష్ణాతులు కావాలన్నారు. విద్యార్థులందరూ ఉత్తమ మార్కులతో ఉతీర్ణులై పాఠశాలకు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. ఆయా సబ్జెక్టులలో ఎలాంటి సందేహాలున్న ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలన్నారు. పరీక్షలు దగ్గరు పడుతున్న తరుణంలో టీవీ, ఫోన్, సోషల్ మీడియా లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. పదో తరగతి తరువాతం ఇంటర్‌లో ప్రవేశాలు పొందాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు పరీక్షల సమయంలో వారికి సహకరించాలన్నారు. కలెక్టర్ వెంట మండల విద్యాధికారి మధుమోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

పెండింగ్‌లో గల పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఆయన చాంబర్‌లో మెదక్, రామాయంపేట మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖాలకు సంబంధించిన వివిధ దశలలో గల పనులపై ఆరా తీసి, ఆయా పనుల పురోగతిని సమీక్షించారు. సాధ్యమైనంత త్వర గా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటలోకి తేవాలన్నారు. మున్సిపాలిటీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలని ఆదేశించారు. సమీక్షలో మెదక్, రామాయంపేట మున్సిపల్ కమిషనర్లు, పీఆర్, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

బోర్డుపై రాసి పాఠాలు బోధిస్తున్న కలెక్టర్

భారీ మెజార్టీతో గెలిపించాలి

ప్రచారం చేస్తున్న మల్క కొమురయ్య

రామాయంపేట, ఫిబ్రవరి 14 : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్ విమర్శించారు. శుక్రవారం రామయంపేట పట్టణంతో బాటు వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య ప్రచారం చేశారు. తపస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచానని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పట్టణంలోని ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలను గతంలో ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత రేవంత్‌రెడ్డిని కలిశామని తమకు న్యాయం చేస్తానని హామీ కూడా ఇచ్చాడన్నారు. అధికారంలో ఉండి ఏడాది గడిచినా నేటికి ఆ సమస్య సమస్యగానే ఉండిపోయిందన్నారు. తపస్ అభ్యర్థి మల్క కొమురయ్యను శాసన మండలికి పంపిస్తే కచ్చితంగా మన ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని నవాత్ సురేశ్ అన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్, రామాయంపేట మండల అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్ కుమార్, ప్రవీణ్, సాంగని యాదగిరి, మన్నె గోపాల్, యాదగిరి, సతీశ్ తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రుల కలలను నిజం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 14 : విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని జడ్జి స్వాతిరెడ్డి సూచించారు. సిద్దిపేట శివారులోని గురుకుల పాఠశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని భోజన నాణ్యత, వంటగది పరిసరాలు, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశ కీలకమైందని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అంతకు ముందు బాలల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యోగా పోటీలో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అల్లాదుర్గం, ఫిబ్రవరి 14 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సీతానగర్ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాయిదంపల్లి గ్రామానికి చెందిన ముసిరిగారి మల్లయ్య(50) ఈనెల 13న ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం సీతానగర్ గ్రామ శివారులోని బోరంచ విఠల్ వ్యవసాయ భూమి పక్కన ఉన్న రోడ్డు పక్కన మల్లయ్య మృతదేహం గ్రామస్తులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. గురువారం సాయంత్రం అల్లాదుర్గంలోని ఐబీ చౌరస్తా వద్ద మల్లయ్య కొంత మంది వ్యక్తులతో మద్యం తాగినట్లు తెలిసింది. అతడి వద్ద అప్పు తీసుకున్న వారు డబ్బులు చెల్లించమని అడిగితే హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుమార్తె బేతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. తండ్రి మృతిపై అనుమానం ఉందని కూతురు పేర్కొంది.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తా

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 14 : ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తానని టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేయించి ఓపీఎస్ పునరుద్ధరణ చేయిస్తానన్నారు. 317 జీవో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మెకాలపు వేతనం ఇప్పించడంతో పాటు కనీసం వేతనం అమలు చేయించే బాధ్యత తీసుకుంటానన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్, టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట యాదగిరి, అధ్యాపకులు రాజు, విజేంద్రరెడ్డి, నరేందర్, సురేశ్, రవీందర్ పాల్గొన్నారు.

పుస్తెమట్టెలు అందజేత

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 14: నిరుపేద వధువు వివాహానికి సిద్దిపేట వాసవిక్లబ్ చేయూతనందించింది. ఆర్యవైశ్య దంపతుల సహకారంతో నిరుపేద వధువు స్వరూప వివాహానికి శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు మురంశెట్టి కుమార్ పుస్తె మట్టెలు, సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ నవీన్‌కుమార్ మాట్లాడారు. వీరే శం, సత్యనారాయణ, శ్రీకాంత్, రమేశ్, దా మోదర్, మంజుల, రూప, ధనలక్ష్మి పాల్గొన్నారు.

డెయిరీ స్కామ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి

జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 14 : మెదక్ విజయ్ డెయిరీ పాలకేంద్రం గత నెలలో జరిగిన రూ. 24 లక్షల స్కామ్ డ్యూటీపై పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని బాధితులు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యా దు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొగుట గ్రామానికి చెందిన మైనర్ దుర్గప్రసాద్‌పై జనవరి 11న విజయ డెయిరీ పాల కేంద్రంలో కుటుంబ సభ్యులపై జరిగిన హత్య ప్రయం, సంఘటనపై కారకులపై కేసు నమోదు చేయాలని కోరారు. 24 లక్షల డబ్బుల విషయంలో మెదక్ టౌన్ పోలీసులు చిత్రహింసలు పెట్టడం వలన బలవంతంగా ఒప్పించారన్నారు. సమగ్ర విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

యువతి అదృశ్యం

గొండ్ల నవ్య (ఫైల్)

రేగోడ్, ఫిబ్రవరి 14 : యువతి అదృశ్యమైన సంఘటన రేగోడ్‌లో చోటుచేసుకుంది. శుక్రవారం ఎస్సై పోచయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రేగోడ్ గ్రామానికి చెందిన గొండ్ల లక్ష్మి కూతురు గొండ్ల నవ్య (19) గురువారం సాయంత్రం నుం చి కనబడుటలేదని తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్ నంబర్ 8712657926కు కాల్ చేసి తెలుపగలరని ఎస్సై పేర్కొన్నారు.

రాధమ్మ యూట్యూబ్ సాంగ్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ప్రోమో సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 14 : సిరిమువ్వలు యూట్యూబ్ చానల్ బ్యానర్‌పై రూపొందించిన 'సుడు సుడే పిల్లో రాధమ్మ' అనే యూట్యూబ్ ఫోక్ సాంగ్ ప్రోమోను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శుక్రవారం నర్సాపూర్‌లోని ఆమె నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సాపూర్ ప్రాంతానికి చెందిన శ్రీశైలం పాటను రచించి స్థానిక కళాకారుల చేత రాధ మ్మ అనే ఫోక్ సాంగ్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. బీఆర్ఎస్ నాయకులు బాబ్యానాయక్, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్ గౌడ్, సూరారం నర్సింహు లు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

జ్యోతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్రనాయకురాలు కత్తికార్తీకగౌడ్

చేగుంట, ఫిబ్రవరి 14 : గుండెపోటుతో మృతి చెందిన ఆకుల జ్యోతి కుటుంబాన్ని శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్రనాయకురాలు కత్తి కార్తీకగౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. నార్సింగి మండల కేంద్రానికి చెందిన ఆకుల శ్రీనివాస్‌గౌడ్ 11న గుండె పోటుతో మృతి చెందగా, ఆయన భార్య జ్యోతి మృతి చెందింది. భర్త, భార్యలు ఇద్దరు నెల వ్యవధిలోనే గుండె పోటుతో మృతి చెందడంతో పాటు కొడుకు కోడలు మృతి తట్టుకోలేక శ్రీనివాస్‌గౌడ్ తల్లి మనెమ్మ పక్ష వాతం జబ్బు కు గురైంది. విషయం తెలుసుకున్న కత్తి కార్తీకగౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి దశదిన కర్మలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మైలరాం బాబు, మాజీ వైస్‌ఎంపీపీ మల్లేశంగౌడ్, గొండ స్వామి, భూపతి రాజు, మహేందర్‌గౌడ్, కొత్త దేవిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కామోజీ, అనురాధ, అనిల్‌గౌడ్, గణేశ్ తదితరులు ఉన్నారు.

ఇద్దరు సీఆర్పీల దుర్మరణం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్పీలు ఎర్ర శ్రీనివాస్,రమేశ్ (ఫైల్)

చేగుంట, ఫిబ్రవరి 14 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్‌పల్లి సమీపంలోని గెస్ట్‌హౌస్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. చేగుంట పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యాశాఖలో మండలంలోని మక్కరాజిపేట కాంప్లెక్స్‌లో సీఆర్పీలుగా పనిచేస్తున్న జేత్రరామ్ తండా కు చెందిన రమేశ్ (35), చందాయిపేటకు చెందిన ఎర్ర శ్రీనివాస్ (40) విధి నిర్వహణలో భాగంగా మక్కరాజిపేట నుంచి చేగుం ట వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో కర్నాల్‌పల్లి సమీపంలోని ఓగెస్ట్ హౌస్ వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రమేశ్ అక్కడిక్కడే మృతి చెందగా, శ్రీనివాస్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వారు తెలిపారు. ఘటనా స్థలానికి చేగుంట ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తూ ప్రాన్ ఏరియా దవాఖానకు తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమగ్రశిక్షా ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలి

టీసీఆర్పీఏ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌కుమార్

మెదక్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లా చేగుంట మండలంలో సమగ్ర శిక్షాలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లుగా పనిచేస్తున్న రమేశ్ నాయక్, ఎర్రం శ్రీనివాస్ విధి నిర్వహణలో భాగంగా స్కూల్ కాంప్లెక్స్ మక్కరాజ్ పేట్ నుంచి ఎమ్మార్సీ చేగుంటకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంపై వారి కుటుంబాలకు తెలంగాణ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తిరందాసు సంతోశ్ కుమార్, ఉపాధ్యక్షుడు రగారి సాయికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతి తెలిపారు. 14 ఏండ్ల పాటు సర్వీస్ అందించి ప్రమాదవశాత్తు మరణిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం అంత్యక్రియల ఖర్చులు ఇవ్వకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. గొడ్డు చాకిరీ చేయించుకొని చనిపోతే అనాథల్లా వదిలివేస్తున్నారని ఆరోపించారు. పక్క రాష్ట్రంలో ప్రమాదవశా త్తూ చనిపోతే రూ.5 లక్షలు, సాధారణ మరణం సంభవిస్తే రూ.2 లక్షలు దహన సంస్కారాల కోసం రూ.25 వేలు ఇస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చనిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగులను ఆదుకోవాలనే సోయి లేకపోవడం దురదృష్టకరమని వాపోయారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలన చేస్తున్న ఏడీ మల్లయ్య

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఫిబ్రవరి 14 : ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ దుబ్బాక ఏడీ కె.మల్లయ్య అన్నారు. శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో సత్యాన్వేశ్, ఏఈవోలు పాల్గొన్నారు.

ఐక్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలి

మిరుదొడ్డి, ఫిబ్రవరి 14 : పల్లెల్లోని రైతులు ఐక్యంగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ సిద్దిపేట సేంద్రియ ప్రముఖ్ సత్తు రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి టౌన్‌లో రైతులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులతో కలిసి కమిటీలు వేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం



స్వచ్ఛందంగా బంద్ నిర్వహించిన వ్యాపార వాణిజ్య సంస్థలు

రామాయంపేట, ఫిబ్రవరి 14 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు ఆధ్వర్యంలో రామాయంపేట పట్టణంలో అంబేద్కర్ యువజన సంఘం బంద్‌నిర్వహించారు. శుక్రవారం మాలమహానాడు ఇచ్చిన బంద్ పిలుపు మేరకు రామాయంపేటలో వ్యాపార సంస్థలు సంపూర్ణంగా బంద్ పాటించాయి. ఉదయం నుంచే మాలమహానాడు ఆధ్వర్యంలో యువజన సంఘం సభ్యులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి దుకాణాలను బంద్ చేయించారు. అనంతరం నినాదాలు చేస్తు ఎస్సీ వర్గీకరణ చేపట్టేది లేదంటూ డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం

నర్సాపూర్, ఫిబ్రవరి 14 : మండల పరిధిలోని అచ్చంపేట్ గ్రామానికి చెందిన నర్సాపూర్ మున్సిపల్ కార్మికుడు పోచయ్య గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి మున్సిపల్ కార్మికులు పోచయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేసి పరామర్శించారు. సీఐటీయూ నాయకులు నర్సమ్మ, మల్లేశం, నాగరాజు ఉన్నారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి, ఫిబ్రవరి 14 : మిరుదొడ్డి మండలం అందెలో ఇటీవల నిరుపేదకుటుంబానికి చెందిన పక్కీర్‌గల్ల రాములు అనే వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం అందె జడ్పీ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎం, ఉపాధ్యాయుల బృందం కలిసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

కాట్రియాల గిరిజన తండాలో సేవాలాల్ జయంతి కరపత్రం ఆవిష్కరిస్తున్న గిరిజనులు

రామాయంపేట, ఫిబ్రవరి 14 : ఈనెల 17న సేవాలాల్ మహారాజ్ జయంతిని మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు రామాయంపేట మండల గిరిజన సంఘం పేర్కొంది. శుక్రవారం రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో సేవాలాల్ 286 జయంతి కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మెదక్ జిల్లా వ్యాప్తంగా గిరిజన సోదరులు పెద్ద ఎత్తున మెదక్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. పల్లెలో ఉన్న గిరిజన తండాల నుంచి జిల్లాలోని అన్ని తండాల వారు ఈ జయంతిలో పాల్గొనాలని అన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

వృద్ధులకు అన్నదానం చేస్తున్న సభ్యులు

నర్సాపూర్, ఫిబ్రవరి 14 : నర్సాపూర్ పట్టణంలోని విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ఓల్డ్ ఏజ్ హోమ్ వ్యవస్థాపకురాలు అభర్ణ సుధాకర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓల్డ్ ఏజ్ హోమ్ సిబ్బంది, వృద్ధులు పాల్గొన్నారు.

రాయితీపై ఆర్టీసీ అద్దె బస్సులు

గజ్వేల్, ఫిబ్రవరి 14: ప్రయాణికుల సౌకర్యార్థం శుభకార్యాలు, విజ్ఞాన యాత్రలు, తీర్థయాత్రలకు వెళ్లేవారు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకుంటే రాయితీ కల్పిస్తామని డీఎం పవన్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక రాయితీతో బస్సులు సమకూర్చేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉందని, అవకాశాన్ని బస్సులు అద్దెకు కావాల్సిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

GOLD FINANCE

★మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308_All

WANTED

★ఇస్మాయిల్‌ఖాన్‌పేట కంది దగ్గర హెచ్‌ఎండి, రేరా అప్రూవల్ ఓపెన్ ప్లాట్స్ మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. మంచి ఇన్సెంటివ్స్ కలవు. Ph: 7095335588.
NT-Raju

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.